17వ
సూర్య
నేటి దినపత్రిక
www.suryaa.com
ఏలూరు జిల్లా, పశ్చిమ గోదావరి జిల్లా
శనివారం,1 జూన్ 2024



# సజావుగా పెన్షన్ల పంపిణీకి పటిష్ట చర్యలు

**- అధికారులు,సిబ్బంది సమన్వయంతో వ్యవహరించాలి**



**ఏలూరు,మేజర్ న్యూస్:** ఎన్నికల ప్రవర్తనా నియమావళి (ఎంసీసీ)ని పాటిస్తూ సామాజిక భద్రత పెన్షనర్లకు ఎలాంటి ఇబ్బంది లేకుండా ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా పెన్షన్ల పంపిణీ ప్రక్రియ సజావుగా సాగేలా క్షేత్రస్థాయిలో పటిష్ట చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులు, సిబ్బందిని డిఆర్డిఏ పిడి డా.ఆర్.విజయరాజు కోరారు. జిల్లాలో జూన్ నెలకు సంబంధించి వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులు, డప్పు కళాకారులు, గీత కార్మికులు, నేత కార్మికులు తదితర కేటగిరీలకు చెందిన 2,68,886 పెన్షన్లలో 2,01,377 పెన్షన్ల మొత్తం రూ.60.41 కోట్లు డీబీటీ ద్వారా బ్యాంకు ఖాతాల్లో జమచేయడం జరుగుతుందన్నారు. అదే విధంగా 67,497 పెన్షన్లను లబ్ధిదారులకు రూ.19.90 కోట్లు డోర్ టు డోర్ విధానంలో ఇంటి వద్దనే పంపిణీ చేయడం జరుగుతుందన్నారు. దివ్యాంగులు, తీవ్ర అనారోగ్యంతో లేవలేని స్థితిలో ఉన్నవారికి మంచం లేదా వీల్‌ఛైర్‌కు పరిమితమైన వారికి, సైనిక సంక్షేమ పింఛన్లు పొందుతున్న యుద్ధవీరుల వృద్ధ వితంతువులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా ఇంటి వద్దనే పెన్షన్లు నగదు రూపంలో అందజేయడం జరుగుతుందన్నారు. వేసవి తీవ్రత దృష్ట్యా సచివాలయ సిబ్బంది తగు జాగ్రత్తలు తీసుకొని జిల్లాలోని యంపిడివోలు,మునిసిపల్ కమిషనర్లు డోర్ టు డోర్ పింఛను పంపిణీ కార్యక్రమాన్ని జూన్ 1వ తేదీ శనివారం ఉదయం 6 గంటలకే ప్రారంభించవలసిందిగా డిఆర్డిఏ పిడి డా.ఆర్.విజయరాజు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు.

# పారదర్శకంగా ఓట్ల లెక్కింపునకు ఏర్పాట్లు

**- స్ట్రాంగ్ రూమ్‌లు,కౌంటింగ్ కేంద్రాలు పరిశీలించిన జిల్లా కలెక్టర్,ఎస్పి**



**ఏలూరు,మేజర్‌న్యూస్:** సాధారణ ఎన్నికల ఓట్ల లెక్కింపును పటిష్టమైన భద్రతా చర్యల మధ్యపూర్తి పారదర్శకంగా నిర్వహించేందుకు విస్తృత ఏర్పాట్లు చేసినట్లు జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ వె. ప్రసన్న వెంకటేష్ చెప్పారు. శుక్రవారం స్థానిక సర్. సి.ఆర్. ఆర్. ఇంజనీరింగ్ కళాశాలలో భద్రపరచిన ఈవిఎంల స్ట్రాంగ్ రూమ్‌లను, కౌంటింగ్ కేంద్రాలను జిల్లా ఎస్పీ డి. మేరీ ప్రశాంతితో కలిసి జిల్లా కలెక్టర్ వె. ప్రసన్న వెంకటేష్ పరిశీలించారు.వీరి వెంట జిల్లా జాయింట్ కలెక్టర్ బి.లావణ్యవేణి, అడిషనల్ ఎస్పీ స్వరూపరాణి,ఐటిడిఎపివో యం.సూర్యతేజ, డిఆర్ఓ డి.పుష్పమణి తదితరులు ఉన్నారు. ఈ సందర్భంగా స్ట్రాంగ్ రూమ్ ల భద్రత ఏర్పాట్లను పరిశీలించిన జిల్లా కలెక్టర్ వె. ప్రసన్న వెంకటేష్ సంబంధిత రిజిస్టర్‌లో సంతకం చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ జిల్లాలో ఏలూరు పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలోని 7అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలో ఓట్ల లెక్కింపుకు సంబంధించి ప్రతి నియోజకవర్గానికి 14 చొప్పున పార్లమెంటుకు, అసెంబ్లీకి కలిపి 28 టేబుల్స్ ను ఏర్పాటు చేయడమైనదన్నారు. జిల్లాలో సుమారు 17 వేల పోస్టల్ బ్యాలెట్లు లెక్కింపు చేయవలసివుంటుందన్నారు. దీనిని రెండు, మూడు రౌండ్లలో పూర్తిచేసేందుకు ఏర్పాట్లు చేశామన్నారు.ఆయా నియోజకవర్గాలను ఓట్ల లెక్కింపునకు సంబంధించి 16 నుంచి 21 రౌండ్లలో ఓట్ల లెక్కింపు పూర్తిచేసే దిశగా ఏర్పాట్లు చేశామన్నారు. ఈవిఎంల ఓట్ల లెక్కింపు ప్రక్రియకు సంబంధించి మధ్యాహ్నం 3 నుంచి 4 గంటల మధ్య ఈవియం లోని ఓట్ల పూర్తి ఫలితాలు అందించేందుకు, సుమారు సా.5.00 గంటల లోపు పోస్టల్ బ్యాలెట్ ఓట్ల పూర్తి ఫలితాలు అందించాలనే దిశగా ప్రణాళిక సిద్ధం చేశామన్నారు. వీరి వెంట రిటర్నింగ్ అధికారులు ఎన్ఎస్‌కె ఖాజావలి, ఓవై.భవానీశంకరి,కె.భాస్కర్,కె.అద్దయ్య, యం.ముక్కంటి, తదితరులు ఉన్నారు.

# అభ్యర్థులు, ఏజెంట్లు ఓట్ల లెక్కింపు కేంద్రాలకు చేరడానికి ప్రణాళిక



**భీమవరం,మేజర్‌న్యూస్:** కౌంటింగ్ సిబ్బంది, పోటీలో ఉన్న అభ్యర్థులు, ఏజెంట్లు సులువుగా ఓట్ల లెక్కింపు కేంద్రాలకు చేరుకోవడానికి పక్కా ప్రణాళికను సిద్ధం చేయాలని జిల్లా కలెక్టర్ జిల్లా ఎన్నికల అధికారి సుమిత్ కుమార్ సంబంధిత అధికారులను ఆదేశించారు.శుక్రవారం స్థానిక వశిష్ట సమావేశనందు జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్, జిల్లా సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ అజిత వేజెండ్ల సంయుక్తంగా రిటర్నింగ్ అధికారులు, ఎస్డిపిఓలతో సమావేశమై కౌంటింగ్ ఏర్పాట్లును సమీక్షించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ కౌంటింగ్ కేంద్రాలకు చేరుకోవడానికి రూట్ మ్యాప్‌లనురూపొందించి, పార్కింగ్ ప్రదేశాల సమాచారాన్ని అందించాలన్నారు. పార్కింగ్, కౌంటింగ్ కేంద్రాలకు చేరుకునే మార్గాలపై కౌంటింగ్ సిబ్బందికి పూర్తి అవగాహన కల్పించాలని రిటర్నింగ్ అధికారులకు సూచించారు.

కొవ్వాడ అన్నవరం సెంటర్ కు చేరుకున్న కౌంటింగ్ సిబ్బంది, ఏజెంట్లుకు విష్ణు కాలేజీ మెయిన్ గేటు వరకు చేరుకోవడానికి ప్రత్యేక బస్సులను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. మీడియా ప్రతినిధులు కూడా ఇదే వాహనాల్లోమీడియా సెంటర్‌కు చేరుకోవాల్సి ఉంటుందన్నారు. అలాగే ఎస్ఆర్‌కెఆర్ ఇంజనీరింగ్ కాలేజీ కౌంటింగ్ కేంద్రాలకు చేరుకోవడానికి నాగరాజు మాల్, ఎన్టీఆర్ విగ్రహం వద్ద బస్సులు ఏర్పాటు చేయడం జరిగిందని, ఆయా ప్రదేశాల నుండి నడిచి వచ్చినకూడా 7,8నిమిషాలు మాత్రమే పడుతుందన్నారు. లేనిపక్షంలోబస్సులు ద్వారా ఎస్ఆర్‌కేఆర్ కళాశాల మెయిన్ గేటు వద్దకు చేరుకోవాల్సి ఉంటుందన్నారు

. ట్రాఫిక్ డైవర్షన్ వివరాలను విపులంగా తెలియజేయడం జరుగుతుందన్నారు. పోలీస్ సెక్యూరిటీ కల్పించిన పోటీలో ఉన్న అభ్యర్థులకు, రిటర్నింగ్ అధికారులకు మాత్రమే కౌంటింగ్ సెంటర్ వరకు వాహనాల అనుమతి ఉంటుందని స్పష్టం చేశారు. కౌంటింగ్ సిబ్బంది నిర్ణీతసమయానికి కౌంటింగ్ కేంద్రాలకు చేరుకోవాలని అప్పుడే నిర్దేశించినసమయానికి కౌంటింగ్ ప్రారంభించుకోవడానికి వీలవుతుంది అన్నారు. కౌంటింగ్ కేంద్రానికి చేరుకునే మార్గంలో రెండు ప్రదేశాలలో చెకింగ్ ఉంటుందని, అలాగే అలాగే మొబైల్‌ని కూడా కచ్చితంగా డిపాజిట్ చేయాలని తెలిపారు. వీటన్నింటిని పట్టే సమయాన్ని దృష్టిలో ఉంచుకొని ఉదయం 6 గంటలకే పోలింగ్ సిబ్బంది కౌంటింగ్ కేంద్రాల వద్దకు చేరుకోవాలన్నారు.

అధికారులు,పోలీస్‌లు సమన్వయంతో పనిచేసి ఓట్ల లెక్కింపుకు ఏవిధమైన ఇబ్బంది లేకుండా విజయవంతంగా పూర్తిచేయడానికి కృషి చేయాలని జిల్లా కలెక్టర్ కోరారు.జిల్లా సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ అజిత వేజెండ్ల మాట్లాడుతూ విధులలోవున్న అధికారులతో సమన్వయం చేసుకుంటూ పోలీసు అధికారులు ముందుకు వెళ్లాలని తెలిపారు.

ఓట్ల లెక్కింపు ప్రక్రియ సజావుగా నిర్వహించడానికి పోలీస్ సిబ్బందికి కేటాయించినవిధులను నిబద్ధతతో నిర్వహించాలన్నారు.కౌంటింగ్‌రోజునగెలిచినఅభ్యర్థులువిజయోత్సవ ర్యాలీలకు, బాణా సంచాకాల్చడానికి అనుమతులే దని స్పష్టంచేశారు.ఏదైనాసమస్య ఎదురైనప్పుడు సానుకూలంగా పరిష్కరించడానికి కృషి చేసి కౌంటింగ్‌కు ఆటంకంలేకుండాచూడాలని తెలిపారు.

ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు యస్పి వి.భీమారావు, జిల్లా జాయింటు కలెక్టరు, ఉండి అసెంబ్లీ నియోజక వర్గ రిటర్నింగు అధికారి సి.వి.ప్రవీణ్ ఆదిత్య, జిల్లా రెవిన్యూ అధికారి జె.ఉదయ భాస్కర రావు, ఏపీ టూరిజం జె.డి మరియు ఆచంట నియోజకవర్గం రిటర్నింగు అధికారి వి.స్వామి నాయుడు, నరసాపురం ఆర్డీవో, రిటర్నింగ్ అధికారి యం.అచ్యుత అంబరీష్,భీమవరం ఆర్డీవో, రిటర్నింగ్ అధికారి కె.శ్రీనివాసులు రాజు, తణుకు మున్సిపల్ కమీషనరు, రిటర్నింగ్ అధికారి బి.వెంకట రమణ, తాడేపల్లిగూడెం ఆర్డీవో, రిటర్నింగ్‌అధికారి కె.చెన్నయ్య,కెఆర్‌సి డిప్యూటీ కలెక్టరు, పాలకొల్లు రిటర్నింగు అధికారి బి.శివనారాయణ రెడ్డి, ట్రైనీ డిప్యూటీ కలెక్టరు కానాలసంగీత్‌మాధుర్, డియస్పిలు జి.శ్రీనివాసరావు, డి.యస్. ఆర్.యస్.యన్.మూర్తి, వి.నారాయణ స్వామి రెడ్డి,ఎలక్షన్ సూపర్డెంటు చందన దుర్గా ప్రసాదు, డిప్యూటీ తహాశీల్దారు మద్రాపు సన్యాసిరావు, తదితరులు పాల్గొన్నారు.


## జిల్లా కారాగారాన్ని పర్యవేక్షించిన జిల్లా జడ్జి



**ఏలూరు,మేజర్ న్యూస్:** రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ అమరావతి ఆదేశాల ప్రకారం ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా ప్రధాన న్యాయమూర్తి సి.పురుషోత్తం కుమార్ ఏలూరులోని జిల్లా కారాగారాన్నిపర్యవేక్షించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఖైదీలకుఅందుతున్నసౌకర్యాలు,ఆహార పదార్థాల నాణ్యత,మంచినీటి సౌకర్యాలు,అత్యవసర పరిస్థితులు అందిస్తున్న వైద్య సదుపాయాల వివరాలను అడిగి తెలుసుకోవడం జరిగిందని,పరిసరపరాల పరిశుభ్రత వారికి అందుబాటులో ఉన్నటువంటి ఉచిత న్యాయ సదుపాయాల వివరించడం జరిగిందని తెలియజేశారు. ఖైదీలతో మాట్లాడుతూ వారి కుటుంబ సభ్యులకు అవసరమైన పక్షంలో ఉచిత న్యాయ సహాయం చేస్తామని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి కె.రత్న ప్రసాద్, ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి కె.కె.వి బుల్లి కృష్ణ,జిల్లా కారాగార సూపరిన్ డెంట్ ఆర్.వి.ఎస్ స్వామి పాల్గొన్నారు.

## డీపీఓ ఆకస్మిక తనిఖీ

## : మొబైల్ కూల్ డ్రింక్ వ్యాన్‌కు తాళాలు



**ఏలూరు,మేజర్‌న్యూస్:**గ్రామాలలో పారిశుధ్య నిర్వహణ సక్రమంగా లేదని పలు ఫిర్యాదులు రావడంతో జిల్లా గ్రామ పంచాయతీ అధికారి తూతిక శ్రీనివాస విశ్వనాథ్ పలు చోట్ల ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. దానిలో భాగంగా సాధారణ ఎన్నికల కౌంటింగ్ జరుగు ప్రదేశాలను క్షుణ్ణంగా పరిశీలించి డస్ట్ బిన్నులు లేని వ్యాపారులపై ఆగ్రహం వ్యక్తం చేసారు. అదే సమయంలో సి.ఆర్. రెడ్డి మహిళా డిగ్రీ కాలేజీ ఎదురుగా ఉన్నా మొబైల్ వ్యాన్ కూల్ డ్రింక్స్ వ్యాపారిని నిలదీశారు. పానీయాలు త్రాగిన గ్లాస్సులను రోడ్డు ప్రక్కన గుట్టలు గుట్టలుగా ఉండడాన్ని గమనించి సీరియస్ అయ్యారు.ఈ సందర్భంగా నిర్లక్ష్యం వహించిన మొబైల్ కూల్ డ్రింక్ వ్యాన్‌కు తాళాలు వేయించి పరిసర ప్రాంతాలని శుభ్రపర్చాలని ఆదేశించారు.

## మద్యం బాటిళ్లు కలిగి ఉన్న ఇద్దరు అరెస్టు



**నూజివీడు,మేజర్ న్యూస్:** నూజివీడు పోలీస్ సర్కిల్ పరిధిలోని చాట్రాయి మండలం కోటపాడు గ్రామానికి చెందిన లక్ష్మి అనే మహిళ వద్ద నుండి 48 అక్రమ మద్యం సీసాలు పట్టుకున్నారు, నూజివీడు మండలం తూర్పు దిగవల్లి గ్రామానికి చెందిన పామర్తి రాంబాబు, అనే వ్యక్తి వద్ద 30 అక్రమ మద్యం సీసాలు దాడి చేసి పట్టుకున్నారు,ఎస్ సి బి, సీఐ వెంకటరమణ తెలిపారు, మద్యం సీసాలు స్వాధీనం చేసుకొని ఇద్దరినీ అరెస్ట్ చేసినట్లుగా తెలిపారు.

# మాబ్ ఆపరేషన్‌పై ప్రజలకు పోలీసుల అవగాహన






**పెదవేగి,మేజర్‌న్యూస్ :**ప్రజాశాంతికి భంగం కలిగించే అల్లరి మూకలను చెదరగొట్టటానికే 'మాబ్ ఆపరేషన్' చేయడం జరుగుతుందని మాక్ డ్రిల్ ఏలూరు జిల్లా ఏ .అర్ అర్.ఐ పవన్ కుమార్ అన్నారు.ప్రజలు శాంతి భద్రతల పరిరక్షణలో పోలీస్ శాఖకు సహకరించాలని,శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు తప్పవని నూజివీడు డీఎస్పీ లక్ష్మయ్య హెచ్చరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూసార్వత్రిక ఎన్నికలు , కౌంటింగ్ నేపథ్యంలో ఏవైనా అవాంఛనీయ సంఘటనలు, హింసాత్మక ఘటనలు చోటు చేసుకున్నా సమయంలో అల్లరి మూకలను చెదరగొట్టడానికి , మాబ్ ఆపరేషన్‌బీ మాక్ డ్రిల్ ముఖ్య ఉద్దేశమని తెలియ చేశారు.జిల్లా ఎస్పీడి మేరీ ప్రశాంతి ఐపీఎస్ ఆదేశాలాపై శుక్రవారంనాడు నూజివీడు సబ్ డివిజన్ లో విజయరాయి గ్రామంలో, సివిల్, ఏఆర్ పోలీసులు, మాబ్ ఆపరేషన్‌బీ మాక్ డ్రిల్ నిర్వహించారు. విధ్వంసానికి పాల్పడుతున్న సందర్భాల్లో సమయస్ఫూర్తితో వ్యవహరిస్తూ , జన సమూహాలను నియంత్రించి శాంతిభద్రతలను ఎలా నియంత్రించాలన్న వాటిపై "మాబ్ ఆపరేషన్" మాక్ డ్రిల్ యొక్క ముఖ్య ఉద్దేశాన్ని సిబ్బంది వివరించారు.ముందుగా ఓవైపుప్లకార్డులు చేతపట్టిన ఆందోళనకారులు, అల్లరి మూకలు మరోవైపు వారిని ఎదుర్కొనేందుకు సిద్ధమైన పోలీసులు జన సమూహాలను కంట్రోల్ చేయుటకు మొదటగా హెచ్చరికలు వినకపోతే పై అధికారుల అనుమతితో భాష్ప వాయువు ప్రయోగించుట, ఆ తర్వాత ఫైర్ డిపార్ట్మెంట్ వారితో వాటర్ కెనాన్ వారిపై ప్రయోగించుట, లాఠీ చార్జ్ చేపట్టుట, ప్లాస్టిక్ పెల్లెట్స్ ఫైరింగ్ చేయుట. అప్పటికి పరిస్థితి అదుపులోకి రాక పోతే ఫైరింగ్ చేయుట వంటివి డెమో ద్వారా ప్రదర్శించారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగించేలా అల్లర్లు గొడవలు సృష్టించే వ్యక్తుల పట్ల చట్టప్రకారం చర్యలు తీసుకోవటం జరుగుతుందన నూజివీడు డీఎస్పీ తెలిపారు.మాక్ డ్రిల్ ముఖ్య ఉద్దేశంశాంతి భద్రతలకు విఘాతం కలిగినప్పుడు, ఘర్షణలు తలెత్తినప్పుడు శాంతిభద్రతలను పరిరక్షించడానికి పోలీస్ శాఖ ఎలా వ్యవహరిస్తుంది.ఘర్షణలకు పాల్పడిన వారిపై ఏవిధంగా చర్యలు తీసుకుంటారుఅనే దాని గురించి ప్రజలకు అవగాహన కలిగించేందుకుగానునిర్వహించడంజరుగుతుందన్నారు.వివిధ రాజకీయ పార్టీల అభ్యర్థులు,కార్యకర్తలుప్రజలు జూన్ 4న జరుగుతున్న ఎన్నికల కౌంటింగ్ సందర్భంగా, కౌంటింగ్ ముగిసిన అనంతరం ఎక్కడైనా అవాంఛనీయ ఘటనలకు, ఘర్షణలకు పాల్పడిన అలాంటి వారిపైకఠిన చర్యలు తీసుకుంటామని డిఎస్పీ హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పెదవేగిసీఐకెశ్రీనివాస్‌కుమార్, పెదవేగిఎస్సై రాజేంద్రప్రసాద్, దెందులూరుఎస్ఐస్వామి,పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు

# గుర్రపు డెక్కతో నిండిన మొగల్తూరు డ్రైన్




**ఆందోళన చెందుతున్న రైతులు**



**నర్సాపురంరూరల్,మేజర్‌న్యూస్:** మొగల్తూరు మురుగు కాలువ గుర్రపు డెక్క తో నిండిపోవడం వల్ల మురుగునీరు కిందకి దిగక సార్వా సీజన్లో వ్యవసాయం చేసుకునే రైతులు తీవ్ర ఇబ్బందులకు గురవుతారని సర్వోదయ రైతు సంఘం నాయకులు చిన మిల్లి వీరబాబు ఆవేదన వ్యక్తం చేశారు. శుక్రవారంరైతులతో కలిసి గుర్రపు డెక్కను పరిశీలించారు. ప్రస్తుతం వేసవికాలం కావడంతో సంబంధిత శాఖల అధికారులు దృష్టి పెట్టి గుర్రపు డెక్కను తొలగించాలని ఆయన కోరారు. కొప్పర్రు గ్రామంలోని బద్ధ వారి పేటలో 110 సంవత్సరాల క్రితం బ్రిటిష్ పాలన లో నిర్మించారని శిధిలావస్థకు చేరటంతో అనేకసార్లు ప్రమాదాలు జరుగుతున్నాయని, రైలింగ్లు విరిగిపోవడం వల్ల మోటార్ సైకిల్ పై వెళ్లేవారు రాత్రి సమయంలో కాలువలో పడిపోయిన సందర్భాలు ఎన్నో ఉన్నాయి అని స్థానికులు చెప్పారు. నర్సాపురం నుండి భీమవరం వెళ్లేందుకు ఈ ఒక్క మార్గమే ఉండటంతో అనేక గ్రామాల ప్రజలు, ఉద్యోగులు నిత్యం ప్రయాణం చేస్తారని, అధికారులు వంతెన నిర్మించేందుకు కృషి చేయాలని స్థానికులు కోరుతున్నారు. నరసాపురం, వీరవాసరం, భీమవరం మండలాలకు చెందిన వేలాది మంది ప్రజలు ఈ వంతెన మీద ప్రయాణిస్తారని, ప్రమాద భరితంగా ఉన్న వంతెనను తొలగించి నూతన వంతెన నిర్మించాలని స్థానికులు కోరుతున్నారు. కాలువలకు నీరు విడుదల చేస్తే మురుగు కాలవలో మరింత నీరు పెరిగి గుర్రపు డెక్క కదిలే అవకాశం ఉండదని వెంటనే నీటిపారుదల శాఖ, డ్రైన్సు శాఖ అధికారులు డెక్కను తొలగించాలని కోరారు. ఈ కార్యక్రమంలోరావి రామారావు,బద్ధ రామ్మోహన్ రావు,వడ్లపాటి సూర్యరావు,మానుకొండ శామేలు,ఇంజేటి పల్లవి ప్రసాద్,బద్ధ రాజేష్,తదితరులు పాల్గొన్నారు.

# సూరేపల్లిలో వ్యక్తిపై అత్యాచారం కేసు నమోదు

**ముసునూరు,మేజర్ న్యూస్:** ఏలూరు జిల్లా ముసునూరు మండలం ఒంటరిగా గేదెలు తోలుకొని వెళ్లిన వివాహితపై ఒక వ్యక్తి అత్యాచారానికి పాల్పడిన సంఘటనలో శుక్రవారం ముసునూరు పోలీసులు కేసు నమోదు చేశారు. ఎస్సై పి వాసు తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని సూరేపల్లి గ్రామానికి చెందిన ఒక వివాహిత ఈనెల 29వ తేదీన పశువులను తోలుకొని పొలానికి వెళ్ళింది గ్రామానికి చెందిన కొండపల్లి చెన్నారావు గత కొద్ది కాలంగా తనను ప్రేమ పేరుతో వేధిస్తున్నట్లు పోలీసులకు ఫిర్యాదు చేసింది.





## ఎన్‌డిఎ కూటమిని కోరుకుంటున్న ప్రజలు



**అగిరిపల్లి,మేజర్ న్యూస్:** అవసరం కోసం నాయకులు కూటమిగా ఏర్పడవచ్చు కాని, రాష్ట్రంలో ప్రస్తుతం ఎన్ డిఎగా ఏర్పడిన కూటమిని సాధారణ ప్రజలు సైతం మనస్ఫూర్తిగా కోరుకుంటున్నారని నూజివీడు నియోజకవర్గం బిజెపి కన్వీనర్ జిఆర్‌కే రంగారావు అన్నారు. శుక్రవారం మేజర్ న్యూస్తో జి ఆర్ కే మాట్లాడుతూ 2014లో సైతం పవన్ కళ్యాణ్ బయట ఉండి బలపర్చిన భారతీయ జనతా పార్టీ మరియు తెలుగుదేశం పార్టీల కూటమికే ప్రజలుమద్దతు ఇవ్వడం జరిగిందని,కేంద్ర-రాష్ట్రాలలో ఒకే కూటమి అధికారంలో ఉండడం వలన వచ్చేటువంటి లబ్ధిని పూర్తిగా పొందకముందే,ఒక దుష్టశక్తి పన్నినపన్నాగంలో ఇరుక్కుని, దీర్ఘకాలం అనుభవం ఉన్న ఉభయ పార్టీలకు చెందిన నాయకులు అపోహలకు లోనై,తప్పుడు అంచనాలు వేసి, వైఫల్యం చెందడంతో 2019 లో వైస్సార్సీపీ అధికారంలోకి వచ్చే విధంగా ప్రవర్తించారాని పేర్కొన్నారు.దీంతో రాష్ట్రం సర్వ విధాల భ్రష్టు పట్టిందని,తమ తప్పులు తెలుసుకొని, 2024 లో కూటమిగా ఏర్పడి-ముఖ్యంగా అశేష,సాధారణ ఆంధ్ర ప్రజలు కోరుకుంటున్న విధంగా పోటీ చేయటంతో, ది 04 జూన్2024 న జరిగే లెక్కింపుతో రాష్ట్రానికి పట్టిన ఒక పెద్దపీడవదిలిపోవడంఅనేదిగ్యారంటీఅని తెలిపారు. తాను కొంత తగ్గి ఈకూటమిఏర్పడటానికిముఖ్య ప్రోత్సాహకులై నటువంటి పవన్ కళ్యాణ్‌కి మరియు తన శక్తిమేర ఇతోదికంగా కృషిచేసిన రఘురామకృష్ణం రాజుకి అభినందనలుతెలియపరచారు రాబోయే కాలంలో రాష్ట్రంలోనూ-కేంద్రంలోనూ ఏర్పడబోయే ఎన్‌డిఎ కూటమితో రాష్ట్రంలో డబల్ ఇంజిన్ సర్కారు ఏర్పడి,ఇక నుంచి అయినా అభివృద్ధి, సంక్షేమ సమతుల్యంతో పరిపాలన సాగి, రాష్ట్రం అభివృద్ధి చెంది-దేశంలోనే అగ్రగామిగా నిలబడి-అమరావతిరాజధానిగా-ప్రపంచ పట్టణాలలో ఒకటిగా పేరు పొందాలని కోరుకుంటూనాని అన్నారు.

## చదువుకు పేదరికం అడ్డు కాదు



**కైకలూరు,మేజర్‌న్యూస్ :** మండల పరిషత్ ప్రాథమిక ఉన్నత పాఠశాల కైకలూరు వెలమపేట కు చెందిన పూర్వ విద్యార్థినిలు మరడాని శివాని,పందిరి పల్లి శ్యామల 2023-24 విద్యా సంవత్సరంలోట్రిపుల్‌ఐటి సీట్లు సాధించిన నేపథ్యంలో పాఠశాలలో అభినందన సభ ఏర్పాటుచేశారు.ఈసందర్భంగా శివాని,శ్యామలకు పూలమాలలతో దుశాలువాతో ఉపాధ్యాయులు సత్కరించారు. వీరిరువురు ఎన్ ఎం ఎం.ఎస్ లో ఉత్తీర్ణత సాధించి పాఠశాలకు మంచి పేరు తీసుకు వచ్చారు. 10వ తరగతి పరీక్షలలో 564,562 మార్కులతో ప్రతిభ కనబరిచారు.ఈసందర్భంగా ప్రధానోపాధ్యాయులు దానంప్రసాద్ మాట్లాడుతూ ఇరువురు ఉన్నతమైన లక్షణాలను ఎన్నుకొని ఉన్నత స్థితికి ఎదగాలని తల్లిదండ్రులకు ఉపాధ్యాయులకు గ్రామానికి మంచి పేరు తీసుకురావాలన్నారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయుని- ఉపాధ్యాయులు ఇరువురునకు నగదు ప్రోత్సాహాలు ప్రకటించి ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో పూర్వ ప్రధానోపాధ్యాయులు సత్యనారాయణ, ఉపాధ్యాయులు బండి కోళ్ల శీను, సముద్రుడు, జయశ్రీ, మణి, రామాంజనేయులు జయరామ నాయుడు, బిశిరీష,ఎండి అక్బర్ హుస్సేన్, పటాకుల వెంకటేశ్వరరావు, టి శీను, సురేంద్ర తదితరులు పాల్గొన్నారు.

## ఆటో డ్రైవర్ కుటుంబానికి న్యాయం చేయాలి



**ఏలూరు,మేజర్ న్యూస్:** ఆటో డ్రైవర్ కుటుంబానికి న్యాయం చేయాలని,దోషులను వెంటనే అరెస్టు చేయాలని,వడ్డీ వ్యాపారస్తుల వేధింపుల కారణంగా ఆత్మహత్య చేసుకున్న పాకుర్ల వెంకన్న బాబు కుటుంబానికి న్యాయం చేయాలని, ఆయన మరణానికి కారణమైన వారిని వెంటనే అరెస్టు చేయాలని ఆటో అండ్ ట్రాలీ డ్రైవర్స్ యూనియన్ (సిఐటియు) జిల్లా ప్రధాన కార్యదర్శి జె గోపి డిమాండ్ చేశారు. మాదేపల్లి పంచాయతీ లింగారుగూడెం గ్రామానికి చెందిన పాకుర్ల వెంకన్న బాబు వయస్సు 33 సంవత్సరాలు దళిత సామాజిక వర్గం కావడంతో వడ్డీ వ్యాపారస్తుల వేధింపులకు బలైపోయాడని ఆవేదన వ్యక్తం చేశారు. వెంకన్న బాబుకు భార్య ముగ్గురు కుమార్తెలు ఉన్నారని తెలిపారు. వడ్డీ వ్యాపారస్తులు చేతి అప్పుగా ఇచ్చిన డబ్బును రాబట్టుకునేందుకు అతని ఇంటి వద్ద ఉన్న ఆటోను బలవంతంగా స్వాధీనం చేసుకొని,తీసుకువెళ్లడంతో మనస్థాపానికి గురైన వెంకన్న బాబు మే 30వ తేదీ గురువారం సాయంత్రం 6 గంటల సమయంలో నిద్ర మాత్రలు తీసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడని విచారం వ్యక్తం చేశారు. ఆటో యూనియన్ నాయకులు సిహెచ్ అమర్ కుమార్,బలరాం తదితర ఆటో డ్రైవర్లు కుటుంబ సభ్యుల్ని పరామర్శించి సంతాపాన్ని తెలియజేశారు.

## చిన్న వెంకన్న సేవలో కొవ్వూరు కూటమి అభ్యర్థి ముప్పిడి



**ద్వారక తిరుమల,మేజర్ న్యూస్:** పవిత్ర పుణ్యక్షేత్రమైన చిన్న వెంకన్న ఆలయానికి శుక్రవారం ఉదయం కొవ్వూరు కూటమి అభ్యర్థి ముప్పిడి వెంకటేశ్వరరావు ఆలయానికి విచ్చేసి స్వామి అమ్మవార్లనుదర్శించుకునిప్రత్యేక పూజలు నిర్వహించుకున్నారు. అనంతరం ఆలయ ముఖమండపంలో పండితులు వేద ఆశీర్వచనాలుపలికిస్వామివారి తీర్థ ప్రసాదాలను అందించారు. ఆయన మాట్లాడుతూ 4వ తేదీ న జరిగే కౌంటింగ్ లో కూటమి ఘన విజయం సాధిస్తుందని చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రి అవుతారని ఆయన ధీమా వ్యక్తం చేశారు.ఈ క్రమంలో యిమ్మడి రత్నాజీ,కూరాకుల బుజ్జి,గువ్వల మావుళ్ళరావు, వాసిరెడ్డి ప్రవీణ్, తదితరులు ఉన్నారు.

# ఓట్ల లెక్కింపులో సమర్థవంతంగా విధులు





- సెల్ ఫోన్లు,ఎలక్ట్రానిక్ పరికరాలకు అనుమతిలేదు
- జిల్లా ఎన్నికల అధికారి వె.ప్రసన్న వెంకటేష్

**ఏలూరు,మేజర్ న్యూస్:** జూన్4వ తేదీన నిర్వహించే ఓట్లలెక్కింపు ప్రక్రియ పూర్తయ్యేవరకు సంబంధిత అధికారులు సమన్వయంతో విధులు నిర్వర్తించాలని జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ వె.ప్రసన్న వెంకటేష్ ఆదేశించారు.శుక్రవారం స్థానిక సర్.సి.ఆర్.ఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో జూన్ 4వ తేదీన నిర్వహించే ఓట్ల లెక్కింపుకు సంబందించి ఓట్ల లెక్కింపు కేంద్రంలో విధులు కేటాయించిన అధికారులు,సిబ్బంది నిర్వర్తించాల్సిన విధులపై జిల్లా ఎస్పీ డి.మేరీ ప్రశాంతితో కలిసి జిల్లా కలెక్టర్ వె.ప్రసన్న వెంకటేష్ సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కౌంటింగ్ హాలులోకి పోటీలోవున్న అభ్యర్థి లేదా వారి ప్రధానఏజెంట్లోఒకరినిమాత్రమే అనుమతించ బడుతుందన్నారు. కౌంటింగ్ హాలులోకి సెల్ ఫోన్లను,ఎలక్ట్రానిక్ పరికరాలు అనుమతించబడవన్నారు.ప్రతి కౌంటింగ్ హాలు వద్ద సర్కిల్ ఇన్స్పెక్టర్ స్థాయి అధికారిని పర్యవేక్షక అధికారిగా నియమించాలన్నారు. లెక్కింపు కేంద్రంలో విధులు నిర్వర్తించే సిబ్బందికి సంబంధించి ర్యాండమైజేషన్ జూన్ 3వ తేదీన నిర్వహించి సంబంధిత శిక్షణ అందించాలన్నారు. మీడియా పాయింట్ వరకు మాత్రమే ఎన్నికల కమీషన్ జారీచేసిన గుర్తింపు కార్డుకలిగిన పాత్రికేయులకు సెల్ ఫోన్ అనుమతించబడతాయన్నారు. ఈ సమావేశంలో జిల్లా ఎస్పీ డి.మేరీ ప్రశాంతి, జాయింట్ కలెక్టర్ బి.లావణ్యవేణి,అధనపుఎస్పీ స్వరూపరాణి, ఐటిడిఎ పివో యం.సూర్యతేజ, డిఆర్ఓ డి.పుష్పమణి,రిటర్నింగ్ అధికారులు ఎన్ఎస్ కె ఖాజావలి, వై.భవానీ శంకరి, కె.భాస్కర్, కె. అద్దయ్య, యం.ముక్కంటి తదితరులు పాల్గొన్నారు.

## ఉపాధి హామీ చట్టాన్ని కాపాడుకుందాం



**ఏలూరు,మేజర్ న్యూస్:** మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ చట్టాన్ని నిర్వీర్యం చేసేందుకు ప్రయత్నిస్తున్న కేంద్ర ప్రభుత్వ చర్యలను ప్రతిఘటించాలని మాదేపల్లి పంచాయతీ జాలిపూడి గ్రామంలో పనిచేస్తున్న ఉపాధి కూలీలకు ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు ఏ రవి పిలుపునిచ్చారు. ఉపాధి హామీ కూలీలకు 400 రూపాయలు వేతనాన్ని ఇవ్వాలని, పని దినాలను 200 రోజులకు పెంచాలని, పట్టణ ప్రాంతాలలో కూలీలకు కూడా ఈ పథకాన్ని వర్తింపజేయాలని కోరారు. ఏలూరు నగరంలో విలీనం చేసిన ఏడు పంచాయతీల కూలీలకు పని కల్పించాలని ఉపాధి హామీ చట్టాన్ని వర్తింప చేయాలని లేనిపక్షంలో ఏడు పంచాయతీల కూలీలను సమీకరించి ఆందోళన చేపడుతామని హెచ్చరించారు. ఉపాధి పని ప్రదేశంలో కూలీలను కలిసిన ఏ రవి సిఐటియు నాయకులు జె గోపి ఉపాధి కూలీల స్థితిగతులను అడిగి తెలుసుకున్నారు.

## శాఖ గ్రంథాలయంలో సర్ ఆర్థర్ కాటన్ సేవలపై శిక్షణ



**నరసాపురం, మేజర్న్యూస్ :**ప్రథమ శ్రేణి శాఖా గ్రంధాలయం నందు జరుగుచున్న వేసవి జ్ఞాన శిబిరంలో వివిధ స్కూల్స్ నుంచి అనేక మంది పిల్లలు పాల్గొంటున్నారు. గ్రేడ్ వన్ లైబ్రేరియన్ కేజే ఎస్ ఎల్ కుమారి ఆధ్వర్యంలో ప్రతిరోజు నేర్చుకుంటున్న అంశాలపై శుక్రవారంపరీక్ష ను నిర్వహించగాసుధీర్ మోహన్, జీవన్ కుమార్ పర్యవేక్షించారు. అనంతరంశాస్త్రవేత్త సుబ్బారావు సర్ ఆర్థర్ కాటన్, యొక్క జీవిత చరిత్ర ను వివరిస్తూ ఆయన చేపట్టిన ధవలేశ్వరం ఆనకట్టవల్ల గోదావరి డెల్టా ఎంత సస్యశ్యామల మైందో, నీటి వనరులను కాపాడుట గురించి వివరంగా తెలియజేశారు. డొక్కా సీతమ్మ యొక్క సమాజ సేవ లను కూడా పిల్లలకు వివరించారు. ఆర్టిస్ట్ శ్రీనివాస్ డ్రాయింగ్ క్లాస్ లో వృత్తం ,స్తూపం ,ఘనము, పిరమిడ్ కొన్ని ఆకారాల ద్వారా బొమ్మల రూపంలోకి ఎలా మార్చుకోవాలో కలర్స్ గురించి వాటి ద్వారా స్కిన్ టోన్ ఎలా కలపాలో పిల్లలకు శిక్షణ ఇచ్చినారు.తమరుపు కృష్ణ పిల్లలకు "బోయగాడు - పక్షులు"కథను వినిపించారు. పుస్తక పఠనం, పత్రిక పఠనం జరిగింది. ఈ కార్యక్రమంలో శ్రీనివాస్ మాస్టారు, సూర్యంబాబు, ప్రవీణ్, మనోజ్ పిల్లల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## ఉద్యోగిలో ప్రావీణ్యత ఉంటే తగిన గుర్తింపు : జిల్లా కలెక్టర్



**భీమవరం,మేజర్ న్యూస్:** స్థానిక కలెక్టరేటు వశిష్ట సమావేశ మందిరం నందు ఏర్పాటుచేసిన కలెక్టరేట్ కోఆర్డినేషన్ సెక్షన్ సూపరింటెండెంట్ తోట లీలా శంకర్ సత్య వరప్రసాద్ శుక్రవారం పదవీ విరమణ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. రెవిన్యూ డిపార్ట్మెంట్లో టైపిస్టుగా జాయిన్ అయి 37 సంవత్సరములు పని చేసి వివిధ హోదాలలో పనిచేసి తహశీల్దారు హోదాలో జిల్లా కలెక్టరేట్ కార్యాలయం కోఆర్డినేషన్ సెక్షన్ సూపరింటెండెంట్గా నేడు పదవీ విరమణ పొందిన తోట లీలా శంకర్ సత్య వరప్రసాద్ జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్,జిల్లా జాయింట్ కలెక్టర్ సి.వి.ప్రవీణ్,జిల్లా కలెక్టరేట్ సిబ్బంది పూలమాలలు, దుశ్యాలువాలు, మేమేంటోలతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఉద్యోగికి నైపుణ్యత ఉంటేనే గుర్తింపు వస్తుందని,ఇందుకు తగిన విధంగా సీనియర్ ఉద్యోగుల నుండి డ్రాఫ్టింగ్, రిపోర్ట్లు తయారు చేయటం తదితర విషయాలను శ్రద్ధగా నేర్చుకోవాలన్నారు.ఈ కార్యక్రమంలో జిల్లా రెవిన్యూ అధికారి జె.ఉదయ భాస్కరరావు,కలెక్టరేటు ఏవో పి.పాపారావు,ఎలక్షన్ సూపర్డెంటు సి.హెచ్ దుర్గాప్రసాద్, ల్యాండు సూపర్డెంటు సి.హెచ్. రవికుమార్, ఎలక్షన్ డిప్యూటీ తహశీల్దారు యం.సన్యాసి రావు, జిల్లా కలెక్టరేటు,భీమవరం ఆర్డీవో కార్యాలయం సిబ్బంది,పాల్గొన్నారు.

## అవాంఛనీయ సంఘటనలకు దూరంగా ఉండాలి



**ఏలూరు,మేజర్ న్యూస్:** జిల్లా ఎస్పీ డి.మేరీ ప్రశాంతి,డిఎస్పి ఈ శ్రీనివాసులు ఆదేశాలపై ఏలూరు వన్ టౌన్ ఇన్స్పెక్టర్ రాజశేఖర్,ఎస్ఐ లక్ష్మణ్ బాబు వారి సిబ్బందితో వడ్డిరగూడెం,వెన్నవల్లి వారి పేటలో జూన్ 4వ తేదీన నిర్వహించే ఎన్నికల కౌంటింగ్ నేపథ్యంలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ప్రజలకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. వన్ టౌన్ ఇన్స్పెక్టర్ మాట్లాడుతూ జూన్ 4వ తేదీన జిల్లా వ్యాప్తంగా 30 పోలీస్ యాక్ట్,144 సెక్షన్ అమలులో ఉన్నదని,ప్రజలు నలుగురు కంటే ఎక్కువ మంది కూడి ఉండరాదని ఎవరైనా అందులకు విరుద్ధముగా ప్రవర్తించిన ఎడల వారిపై చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని,సోషల్ మీడియా మాధ్యమాల ద్వారా ఎదుట వారి మనోభావాలకు ఆటంకం కలిగే లాగానే అసత్య ప్రచారాలు చేసే వారి పట్ల చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఎన్నికల నియమ నిబంధనలను అనుసరించి ప్రతి ఒక్కరు నడుచుకోవాలని ఎట్టి పరిస్థితుల్లోనూ అవాంఛనీయ సంఘటనకు పాల్పడరాదని అన్నారు. సభలు ,సమావేశాలు,ర్యాలీలు నిషేధమని,బాణసంచా కాల్చడం తయారీ అమ్మకాలు పై నిషేధాలు ఉన్నాయని వివరించారు.

## శ్రీ గంగానమ్మ అమ్మవారి వార్షికోత్సవ సంబరాలలో బడేటి చంటి



**ఏలూరు,మేజర్ న్యూస్:** స్థానిక శ్రీరామ్ నగర్ 9వ రోడ్డు నందు వేంచేసియున్న శ్రీ గంగానమ్మ అమ్మవారి 12వ వార్షికోత్సవ సంబరాలలో భాగంగా 108 బిందెలతో అమ్మవారి అభిషేక కార్యక్రమానికి ఏలూరు నియోజకవర్గ ఉమ్మడి అభ్యర్థి బడేటి రాధాకృష్ణయ్య (చంటి) హాజరయ్యారు. ప్రత్యేక పూజలలో పాల్గొన్నారు.ఈ కార్యక్రమంలో వివిధ హోదాలలో ఉన్న తెలుగుదేశం పార్టీ నాయకులు పాల్గొన్నారు.

# కౌంటింగ్ కేంద్రాలు పరిశీలించిన ఐజి,ఎస్పి

- కౌంటింగ్ కేంద్రాల వద్ద 144 సెక్షన్,ఎవరైనా అలజడులు సృష్టిస్తే జైలుకే



**రాజమహేంద్రవరం/ఏలూరు,మేజర్ న్యూస్:** జూన్ 4వ తేదీన నన్నయ యూనివర్సిటీలో జరగనున్న ఓట్లలెక్కింపుకార్యక్రమాన్ని విజయవంతం గా నిర్వహించేందుకు తీసుకున్న ముందస్తు భద్రత ఏర్పాట్లు గురించి జిల్లా ఎస్పీ పి.జగదీష్ ఐజికి వివరించారు. సున్నితమైన ప్రాంతాలను గుర్తించడంతో పాటు, పికెట్లు ఏర్పాటు చేశామని తెలిపారు. సమస్యలు సృష్టిస్తున్నట్లు అనుమానిస్తున్న వ్యక్తులను అదుపులోకి తీసుకుని బైండోవర్ చేసామన్నారు. ఈవీఎంలు ఉంచిన స్ట్రాంగ్ రూమ్ల్లు వద్ద సీసీ కెమరాలను అమర్చామని,అభ్యర్థులు వారి తరుపున ప్రతినిధులు కానీ ఎప్పటికప్పుడు పరిశీలించుకునేందుకు కంట్రోల్ రూమ్ను ఏర్పాటు చేసినట్టు తెలిపారు. ఈ సందర్భంగా ఐజి మాట్లాడుతూ ఓట్ల లెక్కింపు రోజు ఈవీఎంలను భద్రపర్చిన స్ట్రాంగ్ రూమ్లు వద్ద క్రౌడ్ మేనేజ్మెంట్ విషయంలో అప్రమత్తంగా ఉండాలని,నిర్ణీత పాస్ లేకుండా ఎవరినీ అనుమతించవద్దని సూచించారు.

కౌంటింగ్ కేంద్రాల్లో ఫైర్ సేఫ్టీ పరికరాలను సిద్దంగా ఉంచుకోవాలని, అత్యవసర ఆరోగ్య సేవలు అందజేసేందుకు అంబులెన్సులనుసిద్దంగా ఉంచుకోవాలన్నారు. ట్రాఫిక్ డైవర్షన్లు,వాహనాల పార్కింగ్ విషయంలో తగిన సలహాలు సూచనలు ఇచ్చారు.

# లింగ నిర్ధారణ పరీక్షలు చేయడం చట్టరీత్యా నేరం



**భీమవరం,మేజర్ న్యూస్:** స్థానిక జిల్లా కలెక్టరేట్ ఆవరణలో డిఎం అండ్ హెచ్ ఓ కార్యాలయం లో పిసిపిఎన్డిటి జిల్లా సలహా కమిటీ సమావేశం శుక్రవారం డాక్టర్ కె భాను నాయక్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గర్భంలో బిడ్డ ఆరోగ్యంగా ఉందా లేదా ఏమైనా అంగవైకల్యాలు ఉందా అని మాత్రమే స్కానింగ్ ద్వారా చెక్ చేయాలని సూచించారు. అల్ట్రా సౌండ్ స్కానింగ్ మిషన్లు రిజిస్ట్రేషన్ గడువు తేదీకి నెల ముందు ఆన్లైన్లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. అనంతరం జిల్లా కార్యాలయంలో సమర్పించాలన్నారు. రిజిస్ట్రేషన్ గడువు పూర్తయిన యాజమాన్యాలపై కఠిన చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు. డయాగ్నొస్టిక్ ఇమేజింగ్ ఫెర్టిలిటా సెంటర్లు స్కానింగ్ మిషన్ల ద్వారా లింగ నిర్ధారణ సంబంధించి ఎలాంటి స్కానింగ్ చేయబోమని ఆసుపత్రిలో బోర్డులుఏర్పాటు చేయాలనిఆదేశించారు.ఈసమావేశంలో సభ్యులు డిపిఆర్ఓ టి.నాగేశ్వరరావు, ఇన్చార్జి డిపిఎమ్ ఓ డాక్టర్ సిహెచ్ ధనలక్ష్మి,డిఎం అండ్ హెచ్ఓ కార్యాలయం ఇన్చార్జి ఏవో డాక్టర్ సిహెచ్ భావన, డెమోపి అనంతలక్ష్మి,డిహెచ్ఎమ్ఈవిఎస్ఆర్కె కుమారి తదితరులు పాల్గొన్నారు.

# మహిళలపై జరిగే హత్యలు,అత్యాచారాలపై కఠిన చర్యలు

- సిపిఎం జిల్లా కార్యదర్శి ఎ.రవి డిమాండ్



**ఏలూరు,మేజర్ న్యూస్:** మహిళలపై జరిగే హత్యలు, అత్యాచారాలపై కఠిన చర్యలు తీసుకోకపోతే రోజురోజుకు ఏలూరులో జరిగిన రత్న గ్రేస్ సంఘటనలే మరిన్ని పెరిగే అవకాశాలు ఉన్నాయని సిపిఎం జిల్లా కమిటీ తరఫున ఆ పార్టీ జిల్లా కార్యదర్శి ఎ.రవి ఆందోళన వ్యక్తం చేశారు. ఏలూరులోని సత్రంపాడులో రత్నగ్రేస్ అనే యువతి గొంతుకోసి హత్య చేయడాన్ని ఆయన తీవ్రంగా ఖండించారు. ప్రభుత్వం అనేక చట్టాలు తీసుకువచ్చినా వాటి వలన మహిళలకు పూర్తి స్థాయిలో రక్షణ దొరకడం లేదని విమర్శించారు. మహిళలకు అన్యాయం జరిగితే తత్సారం చేయకుండా వెంటనే దోషులను కఠినంగా శిక్షించే విధంగా చట్టాల్లో మార్పులు తేవాలని ఆయన కోరారు. తల్లి దండ్రులు ఆడ పిల్లలను ఒకలా,మగ పిల్లలను మరోలా పెంచడం సరికాదని హితవు పలికారు . పెండ్లి చేసుకొని అత్తవారి ఇంటికి వెళ్ళాల్సిన రత్నగ్రేస్ మృత్యుఒడిలోకి చేరుకోవడం బాధాకరమని,ఆమె మృతికి ప్రగాఢ సానుభూతిని, ఆమె కుటుంబ సభ్యులు సంతాపాన్ని ఆయన తెలియచేసారు.రత్నగ్రేస్ కుటుంబ సభ్యులను ప్రభుత్వమే ఆదుకోవాలని డిమాండ్ చేశారు.

# ముంబైకి చెందిన 60 మంది పాస్టర్స్కి అభిషేకం



**కైకలూరు,మేజర్న్యూస్:** హొసన్న విశ్వాస ప్రార్థన మందిరం వ్యవస్థాపక అధ్యక్షుడు పాస్టర్ ఏజె సుధాకర్ ఆధ్వర్యంలో 30 ,31 తేదీలలో ముంబై నుండి పాస్టర్ జిదానియేలు జాతీయ,అంతర్జాతీయ ప్రసంగీకులు. పాస్టర్ వినయ్ మ్యాథ్యూస్ జి.ఇమ్మానుయేలు, సుమారుగా 60 మంది పాస్టర్స్ ముంబై నుండి స్థానిక సుధాకర్ చర్చికి రావడం జరిగింది. అనంతరం పాస్టర్ సుధాకర్ ఆధ్వర్యంలో భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ విగ్రహాని సందర్శించారు.. హొసన్నా విశ్వాస మందిరంలో ప్రార్థనా కూడిక ఏర్పాటు చేసినారు. ఈ కార్యక్రమం సుధాకర్ఆధ్వర్యంలో కొంతమంది పాస్టర్లకు అభిషేక కార్యక్రమంరాష్ట్ర మహానాడు, అనుబంధ సంఘాల అధ్యక్షులు డాక్టర్ సేవా.నాగ జగన్ బాబురావు మరియు ఎమ్మార్పీఎస్ అధ్యక్షుడు ఏసుపోగు దానియేలు చేతులు మీదుగా పాస్టర్ సుధాకర్ కి. ఏలూరు జిల్లా క్రిస్టియన్ మైనారిటీ సంఘ అధ్యక్షులుగా నియామక పత్రాన్ని, పాస్టర్ బండి ఇమ్మానియేల్ కి ముదినేపల్లి మండల క్రిస్టియన్ మైనారిటీస్ అధ్యక్షులుగా నియామక పత్రాన్నిఅందజేయడం జరిగింది.. పాస్టర్ సుధాకర్ ఆయన భార్య మరియమ్మ( మేరీ)కి వివాహ శుభాకాంక్షలు తెలియజేసినారు. అనంతరం మరికొన్ని చర్చి సంఘాల సభ్యులకు ముఖ్య అతిథులకు అందరికీ భారీగా ప్రేమ విందుని ఏర్పాటు చేయడం జరిగింది.ఈ కార్యక్రమానికి బేతపూడి ప్రసాద్, సునీల్, నాని పాస్టర్ ,మరియదాసుసంఘ పెద్ద మెండదాస్ ,ప్రభాకర్ నాగేశ్వరరావు , డేవిడ్ తదితరులు పాల్గొన్నారు.

## ఏలూరు ప్రభుత్వ ఆసుపత్రిలో ఏసీలు బంద్



**ఏలూరు,మేజర్ న్యూస్:** ఏలూరు ప్రభుత్వ ఆసుపత్రిలో ఏసీలు పనిచేయక గర్భిణీ స్త్రీల వార్డులో చిన్నపిల్లలతో గర్భిణీ స్త్రీలు చెమటలో ఉక్కిరి బిక్కిరి అవుతున్నారు. గత రెండు రోజులుగా ఇదే పరిస్థితి నెలకొంది. ఉష్ణోగ్రత శుక్రవారం 40 డిగ్రీలు ఉండడంతో లోపల ఉక్కిరిబిక్కిరి అవుతున్న తల్లి పిల్లలు.ఎవరికి చెప్పుకోవాలో తెలియని అయోమయ స్థితిలో ఉన్నామని గర్భిణీ స్త్రీలు వాపోయారు.

## నీళ్లతో మునిగిపోయిన పాలకొల్లు బస్టాండు





**పాలకొల్లు,మేజర్న్యూస్:** మురుగు డ్రైన్లు పొంగి పాలకొల్లు బస్టాండు నీళ్లతో మునిగిపోయింది, మున్సిపల్ అధికారులు గత సంవత్సరం, ఈ సంవత్సరం కచ్చా డ్రైన్లు షిల్టు తీయించగా ఈ పరిస్థితి నెలకొంది, బస్టాండ్కి వెళ్లే ప్రయాణికులు కుళ్ళు నీళ్లలో వెళ్లాలంటే చాలా ఇబ్బందిగా వాపోతున్నారు, మున్సిపల్ అధికారులు మొద్దు నిద్ర వేడి వెంటనే ప్రయాణికుల సౌకర్యార్థం డ్రైన్లను శుభ్రం చేయించాలని పలువురు కోరుతున్నారు,

## ఐ మార్ప్యు కంపెనీకి ఎపికైన 29 మంది చాంబర్స్ విద్యార్థులు



**పాలకొల్లు,మేజర్న్యూస్:** స్థానిక బిఆర్ఆర్, జీకేఆర్ చాంబర్స్ డిగ్రీ అండ్ పిజి కళాశాలలో శుక్రవారం సినర్జిన్ కంపెనీ ప్రాంగణం ఎంపిక నిర్వహించబడినది. ఈ ప్రాంగణ ఎంపికలకు 42 మంది అభ్యర్థులు హాజరైనారు. 29 మంది అభ్యర్థులను ఎంపిక చేసినారని, వీరికి జీతము ఇతర ఎలివేన్స్ కలిపి సుమారు 15,000/- నెలకు అభ్యర్థులకు వేతనం వుంటుందని కళాశాల ప్రిన్సిపాల్డా.డి వెంకటేశ్వరరావు తెలిపారు.ఇంట ర్వ్యూలతదనం తరం ఎంపికైన విద్యార్థులకు కళాశాల చైర్మన్ కెవిఆర్ నరసింహారావు చేతులమీదుగా విద్యార్థులకు ఆఫర్ లెటర్స్ అందజేశారు. ఈ కార్యక్రమానికి విచ్చేసిన కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ శ్రీ కలిదిండి రామరాజు మాట్లాడుతూ విద్యా అనంతరం ఉద్యోగ అన్వేషణలో ఉన్న విద్యార్థుల సౌకర్యగా ఈప్రాంగణఎంపికలుతమకళాశాలలో చేపట్టడం ఆనంద దాయకంగా ఉందని, క్రమశిక్షణ,లక్ష నిర్దేశం, సమయస్ఫూర్తితో మెలిగి ఇంటర్వ్యూలలో పాల్గొనాలని, ఉద్యోగ అవకాశాలను అందిపుచ్చుకోవాలని అభ్యర్థులకు ఉద్దేశించారు. కళాశాల చైర్మన్ కెవిఆర్ నరసింహారావు ఎంపికైన విద్యార్థులను అభినందించారు. ఈ ప్రాంగణ ఎంపికలకు ఐమార్ప్యుకంపెనీ హెచ్.ఆర్ బాజీ అభ్యర్థులకు గ్రూప్ డిస్కషన్,హెచ్ఆర్ ఇంటర్వ్యూలు నిర్వహించినారు.భవిష్యత్తులో ఇటువంటి ప్రాంగణ ఎంపికలకు కళాశాలయాజమాన్యంకృషి చేస్తుందని తెలియజేశారు. కార్యక్రమంలో కళాశాల ప్లేస్మెంట్ ఇంచార్జ్ కె లక్ష్మణరావు, కళాశా ల ట్రైనర్ కె సంతోష్ ప్రసాద్, ఇతర అధ్యాపక అధ్యాపకేతర సిబ్బంది పాల్గొన్నారు..

## ధూమపానం మానండి

- క్యాన్సర్ నుండి రక్షణ పొందండి డాక్టర్ అడ్డాల ప్రతాప్ కుమార్



**పాలకొల్లు,మేజర్న్యూస్:** లంకలకోడేరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ అడ్డాల ప్రతాప్ కుమార్ ఆధ్వర్యంలో దగ్గులూరు సచివాలయం వద్ద ఫ్యామిలీ పిజిషన్ క్యాంపు నందు ప్రపంచ పొగాకు వ్యతిరేక దినోత్సవ కార్యక్రమం నిర్వహించారు.ఈ కార్యక్రమంలో డాక్టర్ ప్రతాప్ కుమార్ మాట్లాడుతూ పొగాకు ఉత్పత్తులను ఉపయోగించడం వల్ల నోటి క్యాన్సర్. ఊపిరితిత్తుల క్యాన్సర్. అలాగే గుండెకి ఆక్సిజన్ సరఫరా తగ్గి గుండెపోటు వచ్చే ప్రమాదం ఉందని తెలిపారు. కావున పొగాకు ఉత్పత్తులను వాడకుండా జాగ్రత్త పడాలని తెలిపారు. ధూమపానం మానటకు తగిన కౌన్సిలింగ్ తీసుకుని. చికిత్సపొందిన ఎడల పూర్తిగా మానివేయడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ నవ్య జీవన్. ఆరోగ్య విస్తరణాధికారి గుడాల హరిబాబు. పిహెచ్ఎన్పి ఎలిజిబెత్. సూపర్వైజర్లు డి కమల. ఎస్కే అమలేశ్వర రావు. ఫార్మసిస్ట్ పివి స్వామి. ఎంఎల్ హెచ్పిలు మార్తమ్మ . లిఖిత ప్రియ. హెల్త్ అసిస్టెంట్లు దివాకర్ బాబు.తారకసత్య ..యేసునాదం. డీఈవో సురేష్. ఆశా కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.